


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAI ...మాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ ఆదివారం 18-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 45 పేజీలు : 4 వెల : రూ 2-00

## ఐటీ శాఖ బురిడీ...

హైదరాబాద్, ఫిబ్రవరి 17తెలంగాణలో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ అక్రమ ఆస్తుల కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసును తవ్వే కొద్దీ కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా శివబాలకృష్ణ కేసులో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఆదాయ పన్నులు చెల్లించే విషయంలో ఫేక్ ఐటి రిటర్న్స్ ఫైల్ చేసినట్టు గుర్తించారు ఏసీబీ అధికారులు. హెచ్ఎండీఏలో తొమ్మిదేళ్లుగా చక్రం తిప్పారు శివబాలకృష్ణ. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులకు వ్యాపారాలు ఉన్నట్టు చూపిస్తూ ఫేక్ సంస్థలు ఏర్పాటు చేశారు. సౌందర్య బోటిక్, శారి వర్క్స్ పేరుతో ఐటి రిటర్న్స్ దాఖలు చేశారు. ఆర్థిక ఆదాయాన్ని చూపేందుకు వీరి పేర్ల పై వ్యాపారాలు ఉన్నట్టు సృష్టించి పన్ను ఎగవేతకు కారణం అయ్యారు. ఈ షేల్ కంపెనీల ద్వారా కుటుంబ సభ్యుల పేరుతో ఐటీ రిటర్న్స్ ఫైల్ చేశారు శివబాలకృష్ణ.తన కూతురు పద్మావతికి కూడా ఆదాయం వస్తుందని చూపించారు.

## అసెంబ్లీలో సవాళ్లు... ప్రతి సవాళ్లు...



హైదరాబాద్, ఫిబ్రవరి 17,తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శ్వేత పత్రం అధికార, ప్రతిపక్షాల మధ్య సవాళ్లకు దారి తీసింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రవేశ పెట్టిన శ్వేత పత్రం తప్పుల తడకగా ఉందన్నారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు. గత ప్రభుత్వంపై బురద జల్లేందుకే దీన్ని సభలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. అన్నింటినీ రుజువు చేసేందుకు తమకు సమయం కావాలని స్పీకర్‌కు హరీష్ రిక్వస్ట్ పెట్టారు. దీనిపై మాట్లాడేందుకు మాత్రం హరీష్‌కు కేవలం 30 నిమిషాల సమయం మాత్రమే కేటాయించారు. అభూతకల్పనలతో బీఆర్ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేసేందుకే సత్యదూరమైన పత్రాన్ని సభలో ప్రవేశ పెట్టాలని విమర్శించారు హరీష్‌రావు. ఇది శ్వేత పత్రం కాదని.. అబద్ధపు పత్రమని కామెంట్ చేశారు. మిడ్‌మానేరు విషయంలో మంత్రి చెప్పిందంతా అబద్ధమని అన్నారు. 775 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మిడ్‌మానేరు, ఎల్లంపల్లి తమ హయాంలో పూర్తైందన్నారు. ఈ ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో పూర్తి అయ్యాయని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇకపై పోటీ చేసి సభలో అడుగు పెట్టబోనని సవాల్ చేశారు. హరీష్ రావు మాట్లాడుతున్నంత టైం అధికార పక్షం అడ్డుతగులుతూనే ఉంది. ఆయన చేసిన ప్రతి కామెంట్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో శ్వేత పత్రంపై వాడీ వేడి చర్చ సాగింది. తప్పుడు లెక్కలతో గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నా యన్నారు హరీష్‌రావు. కృష్ణా నదిపై ప్రాజెక్టులు అప్పగిస్తామన్న గెజిట్ తీసుకొస్తే ఖండించిన దిక్కులేదన్నారు. తాము వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని సిద్ధమైతే ప్రభుత్వం స్పందించందన్నారు. ఎన్నికల ప్రచారంలో గోబెల్స్‌ప్రచారం చేసినట్లే.. సభలోనూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శిం చారు. ఆయకట్టు విషయంలో రెండు చోట్ల రెండు రకాలుగా చెప్పారన్నారు హరీష్. రూ.775 కోట్లు ఖర్చు పెట్టి ఎల్లంపల్లి, మిడ్ మానేరు పూర్తి చేశామని... సభను ఉత్తమ్ తప్పుదోవ పట్టించే యత్నం చేశారన్నారు.వాడీ వేడి చర్చతెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శ్వేతపత్రంపై అసెంబ్లీలో వాడివేడి చర్చ కొనసాగుతుంది.

## మేడిగడ్డ పాపాలకు మామా అల్లుళ్లు కారణం కాదా?: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు నిర్మించాలని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు పుర్రెలో పురుగు పుట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చురకలంటించారు. నీటిపారుదల రంగం శ్వేతపత్రంపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా రేవంత్ ప్రసంగించారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ కు ఏ దేవుడు కలలోకి వచ్చి చెప్పారో తెలియదని, ఆయనే ఇంజనీర్లకు సలహా ఇచ్చారని, తుమ్మిడిహెట్టి దగ్గరే ప్రాజెక్టు నిర్మించాలని వారు నియమించిన ఇంజనీర్ల కమిటీ స్పష్టం చేసిందని, మేడిగడ్డ వద్ద నిర్మిస్తే నిరూపయోగమని ఐదుగురు ఇంజనీర్ల కమిటీ తేల్చేసిందన్నారు. ఈ నివేదికను తొక్కిపెట్టి మామా అల్లుళ్లు ప్రాజెక్టు నిర్మించారని దుయ్యబట్టారు.ఇదే విషయాన్ని తొమ్మిదేళ్ల క్రితం మేడిగడ్డ మేడిపండేనా అని పత్రిక సాక్షి పత్రికలో రాశారని, తెలంగాణ ఖజానాను కొల్లగొట్టేందుకు ఇంత దుర్మార్గానికి తెగపడుతారా? అని పశ్నించారు. కెసిఆర్, హరీష్ కలిసి రాష్ట్రానికి ఎంత ద్రోహం చేశారో వాళ్లు తెలుసుకోవాలని, కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని కాదు? కాళేశ్వరం తెలంగాణకు ఒక కళంకంగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందిపోయి.. నిస్సిగ్గుగా సభలో నిలబడి మమ్మల్ని ప్రశ్నిస్తారా? అని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు పగిలిపోతుంటే క్షమాపణలు చెప్పకుండా.. ఇంకా వాదిస్తారా? అని, హరీష్ రావును తాను నిలదిస్తున్నా.. ఈ దుర్మార్గాలకు కారణం మీరు కాదా? ముక్కుసూటిగా రేవంత్ రెడ్డి అడిగారు.ఈ పాపాలకు మామా అల్లుళ్లు కారణం కాదా?, ఇలాంటి పరిస్థితుల్లో మొండి వాదనలు? తొండి వాదనలు వద్దు హరీష్ రావు అని సూచించారు. మీరు నియమించిన అధికారుల నివేదికనే మీరు తప్పు పడతారా? అని ధుయ్యబట్టారు. చేవెళ్లలో ప్రాజెక్టు ఆపితే ఆనాడు ధర్నా చేసిన మా అక్క ఇప్పుడు వారి పక్కనే ఉందని, ఆనాడు దీక్షలు, ధర్నాలు చేసిన సబితక్క.. ఈనాడు హరీష్ రావుని సమర్ధిస్తున్నారా? అని ప్రశ్నించారు. జరిగిన తప్పులకు హరీష్ క్షమాపణ చెప్పి, సిట్టింగ్ జడ్జి విచారణకు వచ్చినపుడు ఎవరి ఒత్తిడితో ఇలా చేశారో కన్ఫెక్షన్ స్టేట్ మెంట్ ఇచ్చి ఒప్పుకోవాలని, కానీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని, జరిగిన తప్పులకు క్షమాపణలు చెప్పి సహకరిస్తే హరీష్ కు గౌరవం ఉండేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.మాట్లాడితే గతంలో గతంలో అని మాట్లాడుతున్నారని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన విషయాలను బిఆర్ఎస్ వాళ్లకు గుర్తు చేస్తున్నామని, ప్రాణహిత చేవెళ్లకు అడ్డంకులను తొలగించేందుకు మహారాష్ట్ర సిఎంతో ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ఎపి సిఎం చర్చించారని తెలియజేశారు. గోదావరి ప్రాజెక్టులపై రిటైర్డ్ ఇంజనీర్లతో ఆనాటి సిఎం కెసిఆర్, ఐదుగురు సభ్యుల కమిటీ 14పేజీల నివేదిక ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2012లో స్టాండింగ్, కో-ఆర్డినేషన్ కమిటీలను వేశారని, ఆనాడు ప్రాణహిత వల్ల మహారాష్ట్రలో ముంపుకు గురయ్యేది 1850 ఎకరాల పట్టా భూములు మాత్రమేనని స్పష్టం చేశారు.


## అన్నారం పిల్లర్లు కుంగుతాయని ఎన్‌డిఎస్‌ఏ రిపోర్ట్: ఉత్తమ్



గాంధీనగర్: మేడిగడ్డలాగే అన్నారం పిల్లర్లు కుంగుతాయని, ఆ బ్యారేజీలో నీళ్లు ఖాళీ చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ రిపోర్ట్ ఇచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నీటి పారుదల రంగంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉతమ్ మాట్లాడారు. అన్నారం బ్యారేజ్, మల్లన్నసాగర్ కు కూడా ప్రమాదం పొంచి ఉందని, కాళ్లేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో క్యాలిటీ కంట్రోల్ లేదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. వందేళ్లు ఉండాల్సిన బ్యారేజ్ మూడేళ్లకు కూలిందని విమర్శలు గుప్పించారు. విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరంలో అవినీతిని కాగ్ రిపోర్ట్ కూడా బయటపెట్టిందని, 2019లో బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేసినా కూడా కనీస పర్యవేక్షణ లేదని మండిపడ్డారు. బ్యారేజ్ కట్టిన మూడేళ్లకే మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడం ఏంటని ఉత్తమ్ ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణ వ్యయాన్ని ఎందుకు పెంచారో చెప్పడం లేదని నిలదీశారు. 81 వేల కోట్లకు సిడబ్ల్యుసి అనుమతి ఉందని, డిపిఆర్ఎస్ ముందే 25 వేల కోట్లు ఎలా పెంచారని ఉత్తమ్ తప్పు పట్టారు. ఇప్పుడు మాత్రం ఆర్థిక భారం భరించలేనంతగా ఉందన్నారు. మేడిగడ్డ నిర్మాణం, డిజైన్, నిర్మాణం చాలా దారుణంగా ఉందని దుయ్యబట్టారు.

## కేసీఆర్ జన్మదినం.. వెయ్యి మంది ఆటో డ్రైవర్‌లకు ప్రమాద బీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా వెయ్యి మంది ఆటో డ్రైవర్‌లకు రూ. లక్ష చొప్పున ప్రమాద బీమా పత్రాలను కేటీఆర్ అందజేశారు. వికలాంగులకు వీల్ చైర్‌లను పంపిణీ చేశారు. 70 కిలోల కేక్ కటింగ్ చేశారు.కేసీఆర్ జన్మదిన వేడుకలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. కేసీఆర్ రాజకీయ, ఉద్యమ నేపథ్యంతో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

## కాశీ విశ్వేశ్వరుణ్ణి దర్శించుకున్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చేరుకుంది. యూపీలో ఆయన పర్యటనకు శనివారం రెండో రోజు. రాహుల్ ఈ ప్రయాణం ప్రారంభించి 35 రోజులైంది.యూపీ చేరుకున్న రాహుల్ కాశీ విశ్వేశ్వరుణ్ణి దర్శించుకున్నారు.కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వారణాసిలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తన ఈ ప్రయాణంలో ఎన్నడూ ద్వేషాన్ని చూడలేదని, యాత్రలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారు కూడా వెంట వచ్చారన్నారు. వారు తనతో చక్కగా మాట్లాడారన్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడమే దేశం పట్ల ప్రకటించే నిజమైన భక్తి అని అన్నారు. ప్రస్తుతం దేశంలో ద్వేషం, భయాందోళనకర వాతావరణం నెలకొని ఉందన్నారు.దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి వారణాసితో విడదీయరాని అనుబంధం ఉంది. పండిట్ నెహ్రూ 1910 నుండి 1950 వరకు అనేకసార్లు కాశీని సందర్శించారు. ప్రధాని అయ్యాక కూడా వారణాసికి వచ్చారు. ఇందిరా గాంధీ కూడా వారణాసిలో రాజకీయ, మతపరమైన పర్యటనలు చేశారు.పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తన తండ్రి పండిట్ మోతీలాల్ నెహ్రూతో కలిసి 1910లో మొదటిసారి కాశీకి వచ్చారు. ఆ తర్వాత 1921లో కాశీ విద్యాపీఠం స్థాపనకు హాజరయ్యారు. ఆ తర్వాత నెహ్రూ 1942, 1946లోనూ కాశీని సందర్శించారు. స్వాతంత్ర్యానంతరం 1950, 1952లో పండిట్ నెహ్రూ ప్రధాన మంత్రి హోదాలో కాశీకి వచ్చారు. 1980 మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జరిపిన వారణాసి పర్యటన చరిత్రాత్మకంగా నిలిచిందని చెబుతుంటారు. ఆరోజున ఇందిర సభ 1979, డిసెబర్ 31న రాత్రి 8 గంటలకు జరగాల్సి ఉండగా, ఆమె జనవరి 1980, జనవరి ఒకటిన ఉదయం 10 గంటలకు 14 గంటలు ఆలస్యంగా వచ్చారు. చల్లటి వాతావరణం ఉన్నప్పటికీ జనం ఆమెను చూసేందుకు, ఆమె మాటల వినేందుకు ఎంతో ఆసక్తి చూపారు.

## అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



హైదరాబాద్, ఫిబ్రవరి 17 సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'నలభై ఏళ్లుగా రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థవంతంగా పోషించాలని, భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నా' అని సీఎం అసెంబ్లీలో ప్రకటించారు.అంతకుముందు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా బీఆర్ఎస్ అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆమె గవర్నర్ కార్యాలంయ ప్రతినిధి ద్వారా ఒక లేఖను, పుష్పగుచ్ఛాన్ని పంపించారు. సీఎం కేసీఆర్ తరఫున మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆ లేఖను, పుష్పగుచ్ఛాన్ని అందుకున్నారు.

## రైతుల సమస్యలపై దిగివచ్చిన కేంద్రం

### ఎంఎస్‌పీపై ప్యానెల్ ఏర్పాటుకు నిర్ణయం

### రైతుల నిరసన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి17: పంటలకు మద్దతుధర(ఎంఎస్‌పీ)తో సహా 12 హామీలను అమలు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు రైతులు ఆందోళన చేపట్టారు. 'ఢిల్లీ ఛలో'పేరుతో మార్చ్ నిర్వహించారు. అయితే, వీరిని హర్యానా-ఢిల్లీ సరిహద్దుల్లోనే పోలీసులు, కేంద్ర బలగాలు అడ్డుకున్నాయి. మరోవైపు రైతులతో కేంద్ర మంత్రులు పలుమార్లు చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. చర్చల కోసం రైతు సంఘాల ప్రతినిదుల పేర్లను కూడా కమిటీ కోరే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. రైతుల డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ రంగంలో పని చేస్తున్న ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో సహా వాటాదారులతో చర్చలు అవసరమని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ప్రస్తుతం పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభు మరియు ఖనౌరీ పాయింట్ల వద్ద రైతులు నిరసన తెలుపుతున్నారు. అక్కడే



క్యాంపులు ఏర్పాటు చేసుకున్నారు. కీలక డిమాండ్ అయిన ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ ఇవ్వడంపై కేంద్రం ఆర్డినెన్స్ తీసుకురావాలని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ శనివారం డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్ రాయ్ రైతు నేతలతో మూడుసార్లు చర్చించారు. ఆదివారం నాలుగో విడత చర్చించనున్నారు.

## క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేక దంపతుల ఆత్మహత్య

కీసర,ఫిబ్రవరి17(ఆర్ఎన్ఎ): మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించలేక భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కీసర గ్రామానికి చెందిన సురేశ్ కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల అప్పుల భారం ఎక్కువ కావడంతో దంపతులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పిల్లలను బంధువుల ఇంటికి పంపించి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఢిల్లీలో రైలు ప్రమాదం.. గూడ్స్ రైలు 10 బోగీలు బోల్తా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి17 : ఢిల్లీలోని రెసిడెన్షియల్ కాలనీ దగ్గర రైలు ప్రమాదం జరిగింది. ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పి బోల్తా పడింది. దీంతో 10 వ్యాగన్లు బోల్తా పడ్డాయి. ఈ ఘటనతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఏం జరిగిందోనని భయాందోళన చెందారు. మరోవైపు మరో ట్రాక్‌లో ప్రయాణికులతో ఉన్న రైలు ఆగి ఉంది. అటు వైపు బోల్తా పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఢిల్లీలోని సరాయ్ రోహిల్లా టెర్మినల్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అధికారులు, రైల్వే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలిస్తున్నారు. గూడ్స్ రైలుకు చెందిన కనీసం 10 వ్యాగన్లు పట్టాలు తప్పినట్లు పోలీసులు తెలిపారు. జకీరా ఫ్లై ఓవర్ సమీపంలో ఉదయం 11:50 గంటల ప్రాంతంలో పటేల్ నగర్-దయాబస్తీ సెక్షన్‌లో ఈ ఘటన జరిగిందని వెల్లడించారు. ట్రాక్ లోపం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

# సంపాదకీయం

ఆదివారం 18-02-2024

## క్విడ్ ప్రోకోకు బాండ్స్ కు తేడా లేదా

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని రద్దు చేసింది సుప్రీంకోర్టు. అసలు ఏంటీ ఎలక్టోరల్ బాండ్ల పథకం? ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ స్కీమ్ ఉద్దేశమేంటి? మోదీ సర్కారు దీన్ని ప్రవేశపెట్టడానికి కారణమేంటి? విపక్షాలు ఈ స్కీమ్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? దీని వల్ల లబ్ధి పొందుతున్నది ఎవరు? దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎందుకీ విధానాన్ని తప్పుపట్టింది? సాధారణంగా రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థలు, కోటీశ్వరులు, అభిమానులు విరాళాలు అందజేస్తూ ఉంటారు. అయితే.. బ్లాక్ మనీని వైట్‌గా మార్చుకునేందుకు చాలా మంది విరాళాల రూపంలో పార్టీలకు అందజేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలకు విరాళాలు సమకూర్చేందుకు ఒక విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. 2017లో కేంద్ర బడ్జెట్‌లో ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశపెట్టి.. దాని ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే విధానానికి శ్రీకారం చుట్టింది.ఆ తర్వాత 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్స్ విధానాన్ని నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం.. దాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దీని ద్వారా ఎవరైనా సరే.. తమ పేరు బయటకు రాకుండా వివిధ రాజకీయ పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలను అందించవచ్చు. రిజిస్టర్ అయి ఉండి.. అంతకుముందు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ఒక శాతం ఓట్లు పొందిన పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల నుంచి నిధులు పొందేందుకు అర్హత ఉంటుంది.రాజకీయ పార్టీలకు సహకారం అందించేందుకు వ్యక్తులు, కంపెనీలకు పారదర్శకమైన విధానం అమల్లోకి తేవడమే ఈ పథకం ఉద్దేశమని అప్పుడు కేంద్రం ప్రకటించింది. మన దేశానికి చెందిన పౌరులు, సంస్థలు వడ్డీ లేకుండా బ్యాంకుల నుంచి ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసే అవకాశం కల్పించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ప్రత్యేక శాఖల్లో వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాలయ విలువైన బాండ్లు అందుబాటులో ఉంచారు. 15 రోజుల కాలపరిమితి ఉండే బాండ్లను దాతల పేర్లు చెప్పాల్సిన అవసరం లేకుండా.. బ్యాంక్ అకౌంట్ నుంచి పేమెంట్ చేయడం ద్వారా కొనుగోలు చేయొచ్చు.అలా దాతలు అందజేసిన ఎలక్టోరల్ బాండ్లను.. రాజకీయ పార్టీలు తమ అధికార అకౌంట్ల ద్వారా మాత్రమే డబ్బు రూపంలోకి మార్చుకునే అవకాశం ఉంది. ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరులో కేవలం 10 రోజుల పాటు మాత్రమే ఈ ఎలక్టోరల్ బాండ్లు అందుబాటులో ఉంటాయి. అయితే.. ఎన్నికల ఏడాది మాత్రం మరో నెలరోజులపాటు ఎక్కువగా బాండ్లు అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేశారు.ఈ బాండ్ల ద్వారా 2018 మార్చి నుంచి 2023 జూలై మధ్య పలు రాజకీయ పార్టీలకు 13 వేల కోట్ల రూపాయల నిధులు అందాయి. 2018 ? 2022 మధ్యే 9 వేల 208 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాలు జరిగాయి. అయితే.. 2023 జనవరిలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయంలో 55 శాతానికి పైగా బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీలకు చేరాయి. అయితే.. ఇందులో సింహభాగం మాత్రం అధికార బీజేపీయే దక్కించుకుంది. 2022-23 సంవత్సరంలో దేశంలోని కేవలం 10 కంపెనీలే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో 332 కోట్ల రూపాయల నిధులు అందజే శాయి. ఇందులో 259 కోట్లు బీజేపీకే అందగా.. 5 ఐదు ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా బీఆర్ఎస్ 90 కోట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్, ఆప్, కాంగ్రెస్ పార్టీలకు 17 కోట్లకు పైగా నిధులు సమకూరాయి.ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో సాగే బ్యాంకుల ద్వారా తీసుకునే డొనేషన్లు పారదర్శకతను పెంచుతాయని తొలి నుంచీ కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. కానీ.. తమకిష్టమైన పార్టీలకు నిధులు అందించడం ద్వారా పలు కంపెనీలు లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తామని విపక్షా లు ఆరోపిస్తున్నాయి.

## మహిళా పథకం వల్ల మున్సిపల్ సిబ్బందికి జీతాలు అందడం లేదు: ఇండోర్ మేయర్



భోపాల్: మహిళా పథకం వల్ల మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి జీతాలు అందడం లేదని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ మేయర్ , బీజేపీ నాయకుడు పుష్యమిత్ర భార్గవ ఆరోపించారు. ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు ప్రతి నెలా రూ.1250 ఇచ్చే లాడ్లీ బెహనా యోజన వల్ల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు అందలేదని మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో అన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి గ్రాంట్లు తక్కువగా వస్తున్నాయని, మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.850 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని నరేంద్ర మోదీపై మండిపడింది. 'లాడ్లీ బెహనా యోజన కారణంగా ఉద్యోగులు తమ జీతాలు పొందడం లేదని ఇండోర్ మేయర్ అంగీకరించారు. మిస్టర్ మోదీ, మీకు ఓట్లు మించి ఏమీ కనిపించదు' అని ఎక్స్‌లో విమర్శించింది.

## కాంగ్రెస్ కి గుడ్‌బై చెప్పనున్న మరో ఇద్దరు కీలక నేతలు !

న్యూఢిల్లీ,ఫిబ్రవరి17: సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సీనియర్ నేతలు వరుసగా పార్టీని వీడుతుండటం ఆ పార్టీకి తలనొప్పిగా మారింది. తాజాగా మరో ఇద్దరు కీలక నేతలు కాంగ్రెస్ కి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు, ఎంపీ నకుల్ నాథ్ తన అన్ని సోషల్ మీడియా ఖాతాల బయోల్లో 'కాంగ్రెస్' అనే పదాన్ని తొలగించడం వైరల్ అవుతుంది. అటు కమల్‌నాథ్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. నకుల్ తన తండ్రితో కలిసి త్వరలోనే బీజేపీల చేరనున్నట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో ఆయన బయో నుంచి 'కాంగ్రెస్'ను తీసివేయడం.. పార్టీ మార్పు ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. కాంగ్రెస్ నేతలకు తమ పార్టీ తలుపులు తెరిచే ఉన్నాయంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం చర్చకు దారితీస్తోంది. కమల్ నాథ్ బీజేపీలో చేరనున్నారనే ఊహాగానాలపై వీడీ శర్మ శుక్రవారం స్పందించారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ వేడుకకు వచ్చిన ఆహ్వానాన్ని కాంగ్రెస్ తిరస్కరించిందన్నారు. ఈ నిర్ణయంతో ఆ పార్టీలో కొందరు అసంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ప్రాణప్రతిష్ఠకు వెళ్లలేదని బాధపడ్డారన్నారు. అలాంటి వారికి తమ పార్టీలో తలుపులు తెరిచే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నకుల్ నాథ్ మధ్యప్రదేశ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక ఎంపీ. వచ్చే ఎన్నికల్లోనూ తాను ఛింద్వాడా స్థానం నుంచి బరిలోకి దిగుతానని ప్రకటించారు. దీనిపై పార్టీ నుంచి అధికారిక స్పందన రాలేదు. నకుల్ పార్టీని వీడితే అది కాంగ్రెస్‌కు గట్టి దెబ్బే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. కమల్‌నాథ్ కుటుంబానికి ఛింద్వాడా కంచుకోట లాంటిదన్నారు. ఇక్కడి నుంచి వరుసగా తొమ్మిదిసార్లు వీరి కుటుంబసభ్యులే నెగ్గారు. 2019లో జరిగిన ఎన్నికల్లో భాజపా రాష్ట్రంలోని 28 స్థానాలను కైవసం చేసుకోగా.. మిగిలిన ఛింద్వాడాలో మాత్రం నకుల్ విజయం సాధించారు.

## వెలుగులోకి లాంగ్ డ్రైవ్ కార్ల బాగోతం...

హైదరాబాద్, ఫిబ్రవరి 17 అద్దెకు కార్లను అందించే లాంగ్ డ్రైవ్ కార్స్ నిర్వాహకుల ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బాధితులను బంధించి చావబాదిన ఘటనలో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. చేస్తే తమ దగ్గర ఉద్యోగం చేయాలి.. లేదంటే చావు దెబ్బలు తినాలి.. ఇదే లాంగ్ డ్రైవ్ కార్స్ తీరు. ఉద్యోగం పేరుతో అభం శుభం తెలియని యువతులను మభ్యపెట్టి లోబర్చుకుంటారు. అడ్డు చెబితే వేధింపులు చిత్రహింసలు, యువకుల పరిస్థితి మరీ దారుణం. మాట వినకపోతే చచ్చేట్టు కొడతారు. బాధితులు బయటకు వచ్చి చెప్పటానికి భయం తో వణికిపోతున్నారు అంటే పరిస్థితి వారి అర్థంచేసుకోవచ్చు. లాంగ్ డ్రైవ్ కార్స్ యజమాని కొప్పుల హరిదీప్ రెడ్డి నిర్వాకం చూసి పోలీసు ఉన్నతాధికారులు సైతం షాకవుతున్నారు.లాంగ్ డ్రైవ్ కార్స్.. ఈ పేరు వినగానే ప్రతి ఒక్కరికీ కార్లను అద్దెలకు అందించే సంస్థ అనే విషయం గుర్తొస్తుంది. కానీ వ్యాపారం ముసుగులో లాంగ్ డ్రైవ్ కార్స్ నిర్వాహకుల దారుణాలు, ఉద్యోగులను బంధించి దాడి చేసిన ఘటనతో బయటపడ్డాయి. లాంగ్ డ్రైవ్ కార్స్ హైదరాబాద్ మహానగరం శివారు మేడిపల్లి బ్రాంచ్‌లో డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులు కొందరు జీతాలు సరిపోక జాబ్‌లు వదులుకున్నారు. అలా లాంగ్ డ్రైవ్ కార్స్ నుంచి బయటకు వచ్చిన ఉద్యోగులు తమ సొంతంగా స్టార్టప్ కు ప్లాన్ చేశారు.ఈ విషయం తెలుసుకున్న లాంగ్ డ్రైవ్స్ కార్ ఓనర్ కొప్పుల హరిదీప్ రెడ్డి.. గత ఉద్యోగులంతా కొత్తగా పెడుతున్న స్టార్టప్ కంపెనీపై దాడి చేశాడు. దాదాపు ముప్పై మంది అనుచరులతో కలిసి 8 మంది ఉద్యోగులపై దాడికి తెగబడ్డారు. చేతికి దొరికిన వస్తువులతో చావబాదాడు. మేడిపల్లిలోని పలు ప్రాంతాలు తిప్పుతూ రాత్రి రెండు మూడు గంటల వరకు అమ్మాయిలను, అబ్బాయిలను బంధించి కొట్టారు. కాగా, ఇప్పటికీ తేజ అనే యువకుడి ఆచూకీ లభించకపోవడంతో వారి చెర నుండి బయటపడి బాధితులు పోలీసులను ఆశ్రయించారు.దాడిలో తీవ్ర గాయలపాలయిన వారిని చూసి వైద్యులే షాక్ అయ్యారు. ఈ ఘటన అనంతరం దాడి నుంచి బయటపడిన యువతీ యువకులు తమపై జరిగిన పైశాచికత్వంపై మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా ప్రస్తుతం లాంగ్ డ్రైవ్ కార్స్ ఓనర్ హరిదీప్ రెడ్డి తో పాటు దాడికి తెగబడిన నిందితులు పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది.

## ఎలక్టోరల్ బాండ్ల రద్దు సరే..తరువాత ఏమిటి?




ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, వాటి జారీని తక్షణం నిలిపివేయాలని బ్యాంకులను ఆదేశిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే తీర్పు. గత పాతికేళ్లలో సుప్రీం కోర్టు ఇంత సంచలానాత్మక , న్యాయమూర్తులు ఏకగ్రీవంగ ఇచ్చన తీర్పు బహుశా ఇదే కావచ్చు. ఎన్నికల ముందు వచ్చిన ఈ తీర్పు కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, భారతీయ జనతాపార్టీని తీవ్ర నిరాశపరిచేది అని చెప్పవచ్చు. అయితే కోర్టులు తీర్పులు ఇచ్చినంత మాత్రాన ప్రభుత్వాలు తాము చేసేది చేయకుండా ఉంటాయా? అదే ఇప్పుడు భారత రాజకీయాలలో ఆసక్తిని రేపుతోంది. మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పును వచ్చే ఎన్నికలకు విపక్షాలు ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉంది. అయితే అధికార బీజేపీ ప్రభావితం చేస్తున్న జాతీయ మీడియా సుప్రీం తీర్పుకు పెద్దగా ప్రచారం కల్పించటం లేదు. ఇది సహజం. అయితే దీనిని ప్రజలలోకి తీసుకువెళ్లేందుకు ప్రతిపక్షాలు సోషల్ మీడియాను ఇతర మార్గలను అన్వేషించవచ్చు. ఇక తిరిగి సుప్రీం కోర్టు తీర్పు విషయానికొస్తే.. కార్పొరేట్లకు దోచిపెట్టి అందుకు ప్రతిఫలంగా వారి నుంచి భారీగా నిధులు సమకూర్చుకొని రాజకీయాలను శాసించాలనుకున్న బిజెపికి ఈ తీర్పుతో కొంతైనా అడ్డుకట్ట పడుతుంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, నిష్కళంక, పారదర్శక రాజకీయాలు కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ తీర్పును స్వాగతిస్తున్నారు. పాలక పార్టీ, కార్పొరేట్ల నడుమ 'నీకిది నాకిది' తరహాలో క్విడ్‌ప్రోకోకు ఎలక్టోరల్ బాండ్ల స్కీం దారి తీస్తుందన్నవారి ఆందోళనలను, వాదనలను సుప్రీం సమర్థించింది. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్లు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఎటువంటి వివరాలూ తెలియని ఎన్నికల బాండ్లను స్వీకరించడమంటే సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనంది. నల్లధనాన్ని అరికట్టేందుకు, పారదర్శకత కోసం ఈ స్కీం తెచ్చామన్న బిజెపి ప్రభుత్వ కుతర్కాన్ని తోసిపారేసింది. రాజకీయ పార్టీలకు రహస్యంగా అపరిమిత విరాళాలకు అనుమతిస్తూ కంపెనీల చట్టంలో చేసిన సవరణ ఏకపక్షమనీ తప్పుబట్టింది. బాండ్ల ద్వారా సేకరించే విరాళాల వివరాలను బహిర్గతం చేయాల్సిందేనని సుప్రీం నొక్కి వక్కాణించింది. ఇప్పటి వరకు జారీ చేసిన బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మార్చి 6 లోగా కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని, ఆ వివరాలను 13 లోగా వెబ్‌సైట్‌లో ఇ.సి ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది.ఆర్‌టిఐ, ఐ.టి చట్టాలకు విరుద్ధంగా, కంపెనీల చట్టంలో ఏకపక్ష సవరణలతో ఎన్నికల బాండ్ల పథకాన్ని మోడీ సర్కారు ఎందుకు తీసుకొచ్చిందో ఈ కాలంలో బిజెపి జేబులోకి చేరిన అజ్ఞాత కార్పొరేట్ల విరాళాల వరదే చెబుతుంది. 2018 జనవరి నుంచి స్కీంను అమల్లోకి తెచ్చారు. ఎన్నికల బాండ్ అంటే ఒక విధంగా ప్రాంసరీ నోటు వంటిది. నిర్దిష్ట సమయాల్లో వాటిని బ్యాంకులు జారీ చేస్తాయి. బాండ్లను వ్యక్తులు, కంపెనీలు కొనుగోలు చేసి తమకు నచ్చిన రాజకీయపార్టీలకు విరాళంగా అందిస్తాయి. వాటిని పార్టీలు నగదుగా మార్చుకొని ఎన్నికలకు, పార్టీ కార్యకలాపాలకు ఉపయోగపెట్టుకుంటాయి. అయితే ఎవరు విరాళాలిచ్చారో బహిర్గతపర్చనవసరం లేదు. 2017-18 నుంచి 2022-23 వరకు దాదాపు 30 తడవల్లో 28 వేల బాండ్లను ఎస్‌బిఐ జారీ చేసింది. వాటి విలువ రూ.16,500 కోట్లకు పైమాటే. వాటిలో రూ.6,500 కోట్లు బిజెపి గల్లాపె÷-టటెలో పడ్డాయి. 2018-19, 2019-20 లలో 70-80 శాతం విరాళాలు బిజెపి ఖాతాకు చేరాయంటే, కార్పొరేట్లకు ఆ పార్టీకి మధ్య పెనవేసుకున్న మైత్రి బంధం తీవ్రత అవగతమవుతుంది.ఎలక్టోరల్ బాండ్లు రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసేందుకేనని పర్యవసానాలబట్టి తెలుస్తోంది. ఎన్నికల నిధి సేకరణలో పెద్ద ఎత్తున గోప్యతతో కూడిన, పారదర్శకత లేని పద్ధతులకు బిజెపి ప్రభుత్వం తెరతీసిందని స్కీం వచ్చినప్పుడే సిపిఎం, పలు ప్రతిపక్ష పార్టీలు, ఎ.డి.ఆర్ వంటి సంస్థలు నిరసించాయి. సుప్రీం కోర్టులో సవాల్ చేశాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట బాండ్ల జారీ ప్రారంభానికి లోపే విచారణ పూర్తి చేయాలని విన్నవించిన మీదట కోర్టు గతేడాది అక్టోబర్‌లో విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించింది. కార్పొరేట్లు అందించిన రాజకీయ నిధులకు బదులుగా రాయితీలు కట్టబెట్టడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం. ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ లక్షణం. తొమ్మిదిన్నరేళ్లలో కార్పొరేట్లు బ్యాంకుల్లో తీసుకున్న రూ.14 లక్షల కోట్ల రుణాలను మోడీ సర్కారు రద్దు చేసింది. కార్పొరేట్ పన్నులో రూ.లక్షల కోట్ల సబ్సిడీలిచ్చింది. సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా అప్పగించింది. స్వేచ్ఛాయుతమైన న్యాయబద్ధమైన ఎన్నికలకు హామీ కల్పించే విధంగా అభ్యర్థులందరూ సమాన స్థాయిలో పోటీ పడాలనే సూత్రాన్ని ఈ విధంగా లభించిన ధనబలంతో బిజెపి వమ్ము చేస్తోంది.

## హిమాంబి పై మరో కేసు నమోదు

హైదరాబాద్ ,యూసుఫ్గూడ సమీపంలోని ఎల్ఎన్నగర్లో పుట్టా రాము హత్య కేసులో నిందితురాలు హిమాంబీతోపాటు ఆమె కుమార్తె, భర్త తమ ఇంటిని ఆక్రమించుకుని బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన బత్తిన దర్మారెడ్డి 2021లో ఎల్ఎన్నగర్లో 60 గజాల ఇంటిని మహేశ్వర్ రెడ్డి వద్ద నుంచి కొనుగోలు చేశాడు. ఆ ఇంటిలో హిమాంబీ కుటుంబం అద్దెకు ఉంది. ఇంటిని ఖాళీ చేయడానికి రెండు నెలల సమయం ఇవ్వాలని, అప్పటి వరకు అద్దె చెల్లిస్తామని దర్మారెడ్డిని కోరారు.

## ఏపీలో పుంజుకుంటున్న కాంగ్రెస్.. ముక్కోణ పోటీ తప్పదా!



అమరావతి, ఫిబ్రవరి17ః మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కుమార్తె శర్మిల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమితులైనప్పటి నుంచి ఏపీ రాజకీయాల్లో అలజడి మొదలైంది. అయితే దీని ప్రభావం ప్రధాన పార్టీల ఎన్నికల అవకాశాలపై ఏ మేరకు ఉంటుందో ఇప్పుడే చెప్పలేము. కానీ శర్మిల మాత్రం వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంలోని బీజేపీకి తొత్తులుగా మారాయంటూ ప్రజలకు గట్టిగా వినిపించేలా అనునిత్యం చాటిచెపుతున్నారు. బీజేపీ అంటే మండిపడుతున్న తటస్థులను శర్మిల మాటలు ఆలోచనలో పడేస్తున్నాయి. ప్రత్యేక హోదా నుంచి విభజన హామీలు, అమరావతి రాజధాని లాంటి అంశాలపై టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల వైఫల్యాలను ఆమె ఎండగడుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఆలంబనగా నిలిచిన బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగానే చూస్తున్నారంటూ షర్మిల దుయ్యబడుతున్నారు. ఈ వర్గాలను తిరిగి కాంగ్రెస్ పార్టీకి దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అణగారిన బహుజన వర్గాల అభ్యున్నతి కోసం మేనిఫెస్టోలో ప్రాధాన్యమిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇవన్నీ కాంగ్రెస్? బలోపేతం కావడానికి దోహదపడొచ్చనేది విశ్లేషకుల అంచనా. మరోవైపు, కాంగ్రెస్ అధినాయకత్వం కూడా ఏపీపై ప్రత్యేకంగా దృష్టిపెడుతోంది. రాహుల్, ప్రియాంక గాంధీలతో పాటు రేవంత్రెడ్డి, సిద్ద రామయ్య వంటి వారు ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఇప్పటిదాకా మోడీ, జగన్?పాలనపై విరుచుకు పడుతున్న వామపక్షాలకు ఇప్పుడు కాంగ్రెస్ కలిసింది. దీంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాల కూటమి ఏర్పడేందుకు అవకాశాలున్నాయి. తెలంగాణలో అధికారం కోసం పోటీ పడే స్థాయిలో కాంగ్రెస్ ఉన్నందున వామపక్షాలతో సరైన అవగాహన కుదరలేదు. ఇక్కడ అలాంటి పరిస్థితి లేనందున ఇరుపార్టీలు కలిసి పోటీ చేసేందుకు అవకాశం ఉంది. ఇక, కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేస్తే ఎవరి విజయావకాశాలను ప్రభావితం చేస్తాయనేది చర్చనీయాంశమైంది. షర్మిల, కాంగ్రెస్ పార్టీ ప్రభావం ప్రధానంగా వైసీపీ మీదనే ఎక్కువగా ఉంటుంది. వైసీపీ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరే అవకాశమున్నట్లు ఇటీవల ఆ పార్టీ నేత కేవీపీ రామచంద్రరావు వెల్లడించారు. టీడీపీ, జనసేన కూటమిలో బీజేపీ చేరితే.. కాషాయ పార్టీకి ఓటెయ్యడానికి ఇష్టం లేని టీడీపీ, జనసేన ఓటర్లు కాంగ్రెస్, వామపక్షాల వైపు మొగ్గు చూసే చాన్స్ ఉంది. తటస్థులు కూడా కాంగ్రెస్ పట్ల ఆకర్షితులవ్వొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అప్పుడు త్రిముఖ పోరు అనివార్యమవుతుంది. కాంగ్రెస్, వామపక్షాల వల్ల ఎవరికెంత డ్యామేజ్ జరుగుతుందనే దానిపై అన్ని పక్షాల్లో జోరుగా చర్చలు సాగుతున్నాయి.

## మేడారం జాతరకు కేంద్రం నిధుల కేటాయింపు




హైదరాబాద్, ఫిబ్రవరి 17ః ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన ఆదివాసీ జాతరైన మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటయించింది. మేడారం జాతర నిర్వహణకు కేంద్రం రూ.3 కోట్లు ప్రకటించింది. కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి శుక్రవారం మీడియాకు ఈ విషయాన్ని వెల్లడించారు. తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు కేటాయించిందని ఆయన తెలిపారు. కాగా, వనదేవతలు సమ్మక్క, సారలమ్మల మేడారం జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు కేటాయించింది. జాతర నిర్వహణను చూసే వివిధ శాఖలకు ఈ ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాగా, ప్రభుత్వం మేడారం జాతర నిర్వహణకు ఏర్పాట్లన్నీ చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వివిధ కారణాల వల్ల జాతరకు వెళ్లలేని భక్తులు సైతం వనదేవతలకు మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ అవకాశం కల్పించింది. ఆన్ లైన్ ద్వారా సమ్మక్క, సారలమ్మలకు మొక్కు చెల్లించుకునే వెసులు బాటు కల్పించింది. ఇక, ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు మేడారం జాతర జరగనున్న విషయం తెలిసిందే. మేడారం జాతరకు ఇప్పటికే ములుగు సర్వం సిద్ధం కాగా.. జాతర ప్రారంభం కాకముందే వనదేవతలకు భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## ఈడీ కస్టడీలో ఉన్న ఇంటిని అమ్మిన నౌహీరాపై చీటింగ్ కేసు

హైదరాబాద్,ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న ఇంటిని తమకు విక్రయిస్తానని రూ. కోట్లు తీసుకుని మోసం చేయ డమే కాకుండా ఇంటిని ఖాళీ చేయాలంటూ రౌడీలతో దౌర్జన్యానికి దిగిన నౌహీరాషేక్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సినీ నిర్మాత బండ్ల గణేష్ కుమారుడు బండ్ల హీరేష్ ఫిలింనగర్ రోడ్డునెంబర్-13 సైట్-2లోని ప్లాటెనెంబర్ 15-ఏలో నౌహీరా షేక్కు చెందిన ఇంట్లో 2023 నుంచి అద్దెకు ఉంటున్నాడు. నౌహీరా షేక్ సదరు ఇంటిని అమ్ముతున్నట్లుగా చెప్పడంతో తామే కొనుగోలు చేస్తామని గత ఏడాది మార్చి 23న నౌహీరాకు రూ.3 కోట్లు అడ్వాన్స్ ఇచ్చాడు. మిగతా మొత్తాన్ని కూడా జమ చేస్తున్న సమయం లో ఈ ఇల్లు ఈడీ కేసులో ఉన్నట్లుగా తెలిసిం దన్నారు. అయితే నౌహీరా మాత్రం మిగతా డబ్బులు చెల్లించాల్సిందిగా తమపై ఒత్తిడి చేస్తుం దని, కేసు విషయం ప్రస్తావించగా దాటవేస్తూ వస్తుందని ఆరోపించారు.

## నూతన తాహాసిల్దార్ కి సన్మానించిన దళిత ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు.



బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-కోటగిరి మండల కేంద్రంలోని తాహాసిల్దార్ కార్యాలయంలో నూతన ఎమ్మార్వోగా పదవి బాధ్యతలు చేపట్టిన సునీత ను ఉమ్మడి కోటగిరి మండల దళిత ఐక్య కార్య చరణ కమిటీ సభ్యులు శనివారం మర్యాద పూర్వ కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాల మహా నాడు మండల అధ్యక్షులు మిర్జాపూర్ సాయన్న, ఎంఆర్పిఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి లాలయ్య ,పుప్పాల సాయిలు,బేగారి రాములు, కన్నం సాయిలు,కొత్తపల్లి సైదయ్య,పాల గంగారం,జంగం సాయిలు,గుంటూరు శ్రీను, బేగరి మారుతి,తదితరులు పాల్గొన్నారు.

## పలు బాధిత కుటుంబలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్




బాల్కొండ నియోజకవర్గప్రతినిధి, ఫిబ్రవరి 17( లోకం తీరు): బాల్కొండ మండలంలోని వివిధ గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టి బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ బొదేపల్లి లొ గడ్డం సాయన్న మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. చిట్టాపూర్ గ్రామంలో గంగాధర్ వాళ్ళ బావ రాజేశ్వర్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జలాల్ పూర్ అమీన్ వాళ్ళ కుమారుడు చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిసాన్ నగర్ గ్రామంలో భూమన్న వాళ్ళ అమ్మ ఎల్లవ్వ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వలలో చిక్కిన కొండచిలువ కాపాడిన పోలీసు అధికారులు



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, ఫిబ్రవరి 17(లోకం తీరు): ముప్కాల్ గ్రామ జనావాసం ప్రాంతం లో ఒక పైథాన్ వలలో చిక్కుకొని ఉన్నదని పోలీస్ వారికి సమచారం రాగానే సిబ్బంది తో కలిసి వెల్లి చూడగ అది 10 అడుగుల పెద్దదిగా ఉండి కొత్తగా నిర్మిస్తున్న ఇంటి లో వలకు చిక్కుకుంది. వెంటనే ముప్కాల్ ఎస్ఐ భాస్కరఛారి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వాళ్లకు సమచారం ఇవ్వగ నిజామాబాద్ నుండి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గణేష్, బీట్ ఆఫీసర్ సురేష్ వాళ్ళు సిబ్బంది తో వచ్చి పామును రెస్క్యూ చేయడం జరిగింది. దానికి చికిత్స అందించి అడవిలో వదిలి వేయడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలకి పోలీస్ వారీ విన్నపం,మీకు జనాలు నివసించు ప్రాంతాలలో ఎక్కడైనా వన్య ప్రాణులు కనపడితే భయపడకుండా సమచారం ఇవ్వండి. వాటిని మేము ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సహాయంతో రెస్క్యూ చేసి అడవిలో వదిలిపెడు తాము. ఈ కార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై భాస్కర చారి, ముప్కాల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా మాజీ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు





బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-తెలంగాణ ఉద్యమనేత, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, శాసన సభ ప్రతిపక్ష నేత,మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఉమ్మడి కోటగిరి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు అలాగే కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో బీఆర్ఎస్ నేతలు,ప్రజా ప్రతినిధులు కేక్ కట్ చేసి కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రాన్ని కోట్లాడి తెచ్చి తొలి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా తొమ్మిదినర ఏండ్లుగా రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు ఆదుకో వాలని ఉద్దేశంతో కెసిఆర్ వెయ్యి మంది కార్మికులకు లక్ష రూపాయల చొప్పున ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ శనివారం నాడు టిఆర్ఎస్ భవన్ లో ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. దేవుని ఆశీస్సులతో కేసీఆర్ ఎల్లప్పుడూ నిండు నూరేండ్లు ఆరోగ్యాంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కోటగిరి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్,వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్,ఉమ్మడి మండల ఎంపిటిసిలు,తాజా మాజీ సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,ఆయా గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ యువజన,విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, కెసిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# దళిత ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ



**-నేడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి**

దళితులు పంచములు కాదు.. ఆది హిందువులు అంటూనే జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారు. మన్యం సంఘాన్ని స్థాపించి దళితుల్లో చైతన్యం తెచ్చారు. జగన్ మిత్ర మండలి పేరిట దళిత బాలబాలికలకు విద్య నేర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. పలు సేవా కార్యక్రమాలతో దళిత జనోద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా, వైతాళికుడిగా నిలిచారు.. భాగ్యరెడ్డి వర్మ. మాదరి భాగయ్యగా జన్మించి.. సమాజ సేవా కార్యక్రమాలతో భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధి చెందిన ఆయన వర్ధంతి ఈ రోజు..నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో అనగారిన వర్గాల గొంతుక భాగ్యరెడ్డి వర్మ.. 1888 సం. మే 22 నాడు మాదిరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు జన్మించారాయన.. తొలిపేరు భాగయ్య.. అయితే వారి కుల గురువు భాగ్యరెడ్డి అనే పేరు పెట్టారు.. (రెడ్డి అంటే పాలకుడు అనే అర్థం కూడా ఉంది) చిన్నప్పటి నుండి సామాజిక స్పృహను అలవరచుకున్న భాగ్య రెడ్డిపై ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, బౌద్ధం ప్రభావం కూడా ఉంది. అంటరానితనం, దేవదాసీ వ్యవస్థ, మద్యపానం తదితర రుగ్మతలపై పోరాటాలు చేయడమే కాదు, స్వయంగా దళితులకు విద్య, ఉపాధి, సామాజిక హోదాల కోసం తన వంతు కృషి చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాను చూసి ఆర్యసమాజం వర్మ అనే బిరుదును ఇచ్చింది.. అలా బాగ్యరెడ్డి వర్మ పేరు వచ్చింది.

అంబేద్కర్ కన్నా ముందే దేశ వ్యాప్తంగా దళితులకు అనాదిగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తిన మహానాయకుడు భాగ్యరెడ్డి వర్మ.. తదనంతర కాలంలో బాబా సాహెబ్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నారు ‘ మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందువులం..’ అని సగర్వంగా చాటారు.. అనగారిన కులాలను ఆది హిందువులు అని పిలవాలని పిలుపునిచ్చారు. భాగ్యరెడ్డి వర్మ సూచన మేరకు హైదరాబాద్, మద్రాసు ప్రభుత్వాలు వారిని ఆది హిందువులుగా గుర్తించాయి. ప్రారంభంలో జగన్ మిత్ర మండలి, ఆ తర్వాత కాలంలోఆది హిందూ మహా సభ పేరిట తన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.. 1910లో చాదర్ఘాట్ దగ్గర ఆది హిందూ పాఠశాల ప్రారంభించారు. మహాత్మా గాంధీ ఈ పాఠశాలను సందర్శించారు. కాలక్రమంలో ఆది హిందూ పాఠశాలలు 26కు విస్తరించాయి.

భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ (తెలంగాణ) సంస్థానానికే పరిమితం కాలేదు.. 1917లో విజయవాడలో అంటరాని కులాల సదస్సును నిర్వహించారు. ఆంధ్ర జిల్లాల్లో కూడా పర్యటించి అనగారిన వర్గాల్లో చైతన్యం తీసుకు వచ్చారు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.. భాగ్యరెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో కన్నుమూశారు.

# విద్యార్థినీలకు హైజీన్ కిట్ల పంపిణీ



**విశ్యార్థినులకు హైజీన్ కిట్ల పంపిణీ**

**- సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన**



సుబేదారి..విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలంటే ఆర్తి, స్ఫూర్తి, కీర్తి అనే మూడు సూత్రాలే ప్రామాణికమని నాయిని విశాల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ నాయిని శ్రీగోధ అన్నారు. శనివారం రోజున వడ్డేపల్లి ప్రభుత్వ పింగళి మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి) లో మహిళాశిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, నాయిని విశాల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం రాబోయే పరీక్షలు సన్నద్ధత అంశంపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీగోధ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను సాధించడానికి విద్యార్థిని విద్యార్థులకు ఎన్నో అవరోధాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అయితే ఆర్తి చెంది మహనీయుల స్ఫూర్తితో చదివితే కీర్తి పతాకం ఎగురవేస్తారని అన్నారు. శ్రద్ధా, ఆసక్తితో చదివితే వంద శాతం ఫలితాలు తథ్యమని, ఉన్నతమైన ఆశయాలతో చదివి ఉన్నత స్థాయిలో ఎదగాలని, సంకల్పం ఉన్న వ్యక్తికి పేదరికం అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద లాంటి మహనీయుల బాటలో నడిచి భవిష్యత్ దిశా నిర్దేశం చేసుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు, ఎంత ఎత్తుకు ఎదిగామన్నది ముఖ్యం కాదని, విద్యా వైద్య ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధికి దూరంగా ఉన్న ఎంతమందికి చేయూతనివ్వాలో తెలుసుకోవాలని, ముఖ్యంగా గ్రామీణ మారు మూల ప్రాంత ప్రజలకు సేవలందించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చే విద్యార్థినీలు లక్ష్యసాధన కోసం కళాశాలకు వస్తారని అయితే చాలా మంది రక్త హీనతతో బాధ పడుతున్నారని. ఆరోగ్యంగా ఉంటేనే చదవడానికి ఆసక్తి కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారం తీసుకోవాలని, సర్వైకల్ బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించి ఎవరైనా సమస్యలు ఉంటే సంబంధిత వైద్యులకు చూపించుకోవాలని అన్నారు. వైద్య విద్యలో పీజీ పూర్తికాగానే తమ ట్రస్ట్ ద్వారా ప్రతి నెలా పింగళి కళాశాల విద్యార్థినీలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని. ప్రస్తుత విద్యార్థినిలు కూడా ఉన్నత రంగాల్లో రాణించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కే సుజాత మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల వివరించారు. సైబర్ క్రైమ్, ర్యాగింగ్ మరియు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలని అన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మొదటి గురువులు తల్లితండ్రులని తరువాత అధ్యాపకులేనని వారిచ్చే ప్రతి సూచన సలహా మేరకు నడుచుకోవాలని అన్నారు. అనంతరం నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు హైజీన్ కిట్ల పంపిణీ కార్యక్రమం డాక్టర్ శ్రీగోధ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. అనంతరం డాక్టర్ శ్రీగోధ, డి విష్ణు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కే సుజాత, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్ లను ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుహాసిని సమన్వయకర్తగా వ్యవహరించగా, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ డి జే చారి, డాక్టర్ పార్వతి, డాక్టర్ రేణుక, డాక్టర్ స్నేహాలత రెడ్డి, ఈవి సాత్వీక, దీక్షితారెడ్డి, రాధిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ పట్ల మాకు గౌరవం ఉంది కానీ.. : దేశపతి శ్రీనివాస్



హైదరాబాద్ : మాకు రాజీవ్ గాంధీ పట్ల మాకు గౌరవం ఉంది. దేశం కోసం అయినా చేసిన సేవలు పట్ల సదాభిప్రాయం ఉందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సచివాలయం ప్రాంగణంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆయన స్పందించారు. ఈ మేరకు శాసనమండలిలో ఆయన మాట్లాడారు. జాతీయ నాయకుల పేర్లు అనేక వాటికి పెట్టుకున్నాం. ఇప్పటికే రాజీవ్ గాంధీ పేరు ఎయిర్‌పోర్ట్‌కి పెట్టుకున్నాం. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట ఈ విగ్రహం పెట్టడం సరైంది కాదన్నారు. కానీ, తెలంగాణ తల్లితెలంగాణకు అత్యంత ముఖ్యం. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రభుత్వం గౌరవించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

## ఫిబ్రవరి 19న మంథని తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ

**-మంథనిలో నిర్వహించే ప్రజావాణి కి హాజరుకానున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

మంథని,ఫిబ్రవరి 19న సోమవారం జిల్లా కలెక్టరేట్ తో పాటు మంథని తహసిల్దార్ కార్యాలయంలో రెండు చోట్ల ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం తెలిపారు. మంథని డివిజన్ సంబంధించి మంథని తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు పాల్గొంటారని తెలిపారు. జిల్లా కేంద్రంలో, మంథని డివిజన్ కేంద్రంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ అర్జీలను సమర్పించవచ్చు అని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు కలెక్టరేట్ లో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో, మంథని డివిజన్ అధికారులు డివిజన్ కేంద్రంలోని మంథని తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించు ప్రజావాణి కార్యక్రమంలో ఉదయం 10 గంటల నుండి అందుబాటులో ఉండే విధంగా సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## రోజుకో మలుపు తిరుగుతున్న రాము హత్య కేసు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 జూబ్లీహిల్స్ హనీట్రాప్ మర్డర్ కేసు రోజుకొక మలుపు తిరుగుతోంది. హత్య జరిగిన గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించారని పోలీసులకు ప్రసంశలు వెల్లువెత్తుతున్న తరుణంలోనే...కీలకమైన నిందితులను వారే తప్పించారన్న ప్రచారం జరుగుతోంది. హత్యలో రౌడీషీటర్ జిలానీ పాల్గొన్నట్లు సీసీ కెమెరా ఫుటేజీలో స్పష్టంగా ఉన్నా...ఇప్పటికీ పోలీసులు జిలానీని అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. యూసఫ్ గూడలో స్తిరాస్తి వ్యాపారి సింగోటం రామహత్య కేసు రోజుకొక మలుపు తిరుగుతోంది. హనీట్రాప్ మాయలో పడేసి రామన్నను అతి కిరాతకంగా నరికి చంపేశారు. ఈ కేసులో ఇద్దరు మహిళలతోపాటు ప్రధాన నిందితుడు మణికంఠను గంటల వ్యవధిలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ హత్యలో పాల్గొన్న మరో కీలక నిందితుడు రౌడీషీటర్ జిలానీను పోలీసులు ఇప్పటి వరకు పట్టుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాము కేసులో అసలు నిందితులను పోలీసులు తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రౌడీషీటర్ జిలానీ గతంలోనూ ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండి పోలీసుల సాయంతోనే తప్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా అతనిపై పలు హత్య కేసులు, అటెంప్ట్ మర్డర్, బెదిరింపు కేసులు ఉన్నాయి. అయినా పోలీసులు తాత్సారం చూపించడం చూస్తుంటే..ఈ కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాదాపూర్ లో ల్యాండ్ వివాదంలో రియల్ ఎస్టేట్( వ్యాపారులపై కాల్పులు జరిపిన ఘటనలో జిలానీ ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చాడు. గతంలో బోరబండకు చెందిన నదీం అనే యువకుడ్ని హత్య చేసిన కేసు లో పోలీసులు రౌడీ షీటర్ జిలానీ ని తప్పించారని నదీం కుటుంబ సభ్యుల ఆరోపిస్తున్నారు. స్తిరాస్థి వ్యాపారంలో తలెత్తిన ఆర్థిక లావాదేవీల జిలానీతో కలిసి హత్యక ప్రణాళిక రచించారు. ఇప్పటి వరకు పోలీసులు ఇదే విషయం చెబుతున్నా....రాముకి జిలానీకి మధ్య కూడా ఏమైనా ఆర్థిక లావాదేవీలు ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. స్థిరాస్తి వ్యాపారులను బెదిరించడం, సెటిల్మెంట్లు చేయడం జిలానీకి వెన్నతో పెట్టిన విద్య. గతంలోనూ ఇలాంటి కేసుల్లో తలదూర్చి జైలుకు వెళ్లి వచ్చిన అనుభవం ఉండటంతో సింగోటం రామన్న, రౌడీషీటర్ జిలానీ మధ్య కూడా ఏమైనా ఆర్థిక లావాదేవీలు కొనసాగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే హత్య జరిగిన అనంతరం పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యకంగా టీంలు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. స్తిరాస్థి వ్యాపారంలో నగదు లావాదేవీల్లో తలెత్తిన విభేదాల కారణంగా రాముపై కక్షపెంచుకున్న మణికంఠ...ఎలాగైనా అతన్ని అంతమొందించాలని పథకం వేశాడు. యూసఫ్ గూడకు చెందిన హిమాంబి అనే మహిళను సంప్రదించగా....ఆమె కుమార్తె ద్వారా హనీట్రాప్ కు పాల్పడి రాముని మహిళ ఇంటికి పిలిపించారు

## ఆర్టీసి తాత్కాలిక బస్టాండ్ ప్రారంభం

**మేడారంమేడారంలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క.**

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్ పాల్గొన్నారు. ఆర్టీసీ వరంగల్ ఆర్ ఎం శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్. ప్రత్యేక పూజలు నిర్వహించిన సీతక్క. బస్ టికెట్ కౌంటర్స్, క్యూ లైన్స్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి . ఎస్పీ శబరిష్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# సినిమా తీరు

## మూవీ రివ్యూ : భామా కలాపం-2




'భామా కలాపం-2' మూవీ రివ్యూ నటీనటులు: ప్రియమణి-శరణ్య ప్రదీప్-బ్రహ్మాజీ-సీరత్ కపూర్-రుద్ర ప్రతాప్-రఘు ముఖర్జీ-అనూజ్ గుర్వారా తదితరులు సంగీతం: ప్రశాంత్ విహారి ఛాయాగ్రహణం: దీపక్ ఎరగెర నిర్మాతలు: భోగవల్లి బాపినీడు-సుధీర్ ఈదర రచన-దర్శకత్వం: అభిమన్యు తాడిమేటి ప్రియమణి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'ఆహా' వారి భామా కలాపం మంచి వినోదాన్నిచ్చి ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడా వెబ్ ఫిలింకి సీక్వెల్ తెరకెక్కింది. అభిమన్యు తాడిమేటి రూపొందించిన 'భామా కలాపం-2' ఆహా ద్వారానే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: వంటల అమితాసక్తితో యూట్యూబ్ ఛానెల్ నడిపే అనుపమ (ప్రియమణి)కు ఇరుగు పొరుగు వాళ్ల సంగతులంటే అమితాసక్తి. ఈ ఆసక్తితోనే తన అపార్ట్మెంట్లో సంబంధం లేని వ్యవహారాల్లో తలదూర్చి ఒక హత్య కేసులో చిక్కుకుంటుంది. ఎన్నో ఇబ్బందుల తర్వాత ఆ కేసు నుంచి అనుపమ బయటపడ్డాక.. భర్త ఆమెతో కలిసి వేరే ఇంటికి మకాం మారుస్తాడు. అక్కడికి వెళ్లాక సొంతంగా ఒక హోటల్ తెరుస్తుంది. దాన్ని సజావుగా నడిపిస్తూ అంతా సాఫీగా సాగుతున్న సమయంలో అనుపమ వల్ల పోలీసులకు పట్టుబడ్డ ఒక క్రిమినల్.. ఆమెను బెదిరిస్తాడు. అతడి నుంచి తప్పించుకునేందుకు పోలీస్ అధికారి అయిన సదానంద్ (రఘు ముఖర్జీ)ని ఆశ్రయిస్తుంది అనుపమ. కానీ అతను ఆ క్రిమినల్ కథ ముగించి.. అనుపమను ఒక దొంగతనం చేయాలని బ్లాక్ మెయిల్ చేస్తాడు. తప్పనిసరి పరిస్థితుల్లో అనుపమ ఆ పని చేయడానికి సిద్ధపడుతుంది. ఇంతకీ ఆమె దొంగతనం చేయాల్సిన వస్తువేంటి.. రఘు దాంతో ఏం చేయాలనుకుంటాడు.. చివరికి అనుపమ ఈ టాస్క్ పూర్తి చేసి అన్ని సమస్యల నుంచి బయటపడిందా లేదా అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: ఆహాలో వచ్చిన 'భామాకలాపం' ఎప్పుడూ చూసే క్రైమ్ థ్రిల్లర్లకు భిన్నంగా అనిపించడానికి ప్రధాన కారణం.. అందులో ప్రియమణి చేసిన లీడ్ రోల్. ఒక మధ్య తరగతి హౌస్ వైఫ్ ను లీడ్ రోల్ లో పెట్టి క్రైమ్ కామెడీ తీయాలనుకోవడం భలే ఐడియా. ఓవైపు వంటల మీద యూట్యూబ్ ఛానెల్ నడుపుతూ.. ఇంకోవైపు అవసరం లేని పొరుగిళ్ల కబుర్లు తెలుసుకునేందుకు విపరీతమైన క్యూరియాసిటీ చూపించే సగటు మధ్య తరగతి మహిళగా ఆమె పాత్ర ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. కొంచెం లాజిక్కులకు దూరంగా సాగినప్పటికీ.. 'భామాకలాపం' చాలా వరకు మంచి వినోదమే పంచింది. ఇప్పుడు ఆ ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ని కొనసాగిస్తూ.. ఆమెకో కొత్త సమస్య.. కొత్త టాస్క్ ఇచ్చి సీక్వెల్ తీశారు. అదే.. భామాకలాపం-2. తొలి భాగం ఎక్కడ ముగిసిందో అక్కడ్నుంచే కథను మొదలుపెట్టి ఒక ప్రాపర్ సీక్వెల్ తీశారు. ఈసారి 'భామ'కు ఇచ్చిన టాస్క్ పెద్దదే. కానీ సినిమా రేంజ్ పెరిగింది కానీ.. కంటెంట్ రేంజ్ మాత్రం పెరగలేదు. రెండు గంటలు ఏదో అలా అలా టైంపాస్ చేయించడంలో 'భామాకలాపం' సక్సెస్ అయినా.. ఎక్కువ థ్రిల్ చేయలేకపోయింది. మరీ నవ్వించనూ లేకపోయింది. 'భామాకలాపం'లో ప్రేక్షకులను ప్రధానంగా ఎంగేజ్ చేసేది ప్రియమణి చేసిన అనుపమ పాత్రే. ఐతే ఆ సినిమా చూస్తున్నపుడు కొత్తగా అనిపించే ఆ పాత్ర.. 'భామాకలాపం-2'లో మామూలుగానే అనిపిస్తుంది. ఆ పాత్ర వ్యవహారమంతా ఆల్రెడీ అలవాటైపోయి ఉండడం వల్ల క్యూరియాసిటీ ఏమీ ఉండదు. కథ పరంగా ఏం కొత్తదనం ఉంటుందా అనే చూస్తాం. వెయ్యి కోట్ల విలువైన కొకైన్ చుట్టూ పెద్ద సెటప్పే పెట్టుకున్నారు కానీ.. ఇలాంటి క్రైమ్ కామెడీలు పదుల సంఖ్యలో వచ్చాయి కాబట్టి ఆ విషయంలోనూ ఎగ్జైట్మెంట్ ఏమీ కలగదు. ఒక విలువైన వస్తువు లేదా డబ్బు కోసం కొన్ని గ్యాంగులు ఎవరి ప్లాన్లు వాళ్లు వేసుకుని రంగంలోకి దిగడం.. ఎత్తులు పైఎత్తులు వేయడం.. చివరికి ఈ గ్యాంగులన్నీ కొట్టేసుకుని లీడ్ క్యారెక్టర్ సేఫ్ గా బయటపడి హీరో అవడం.. 'క్షణక్షణం' రోజుల నుంచి ఈ టెంప్లేట్ చూస్తున్నాం. 'భామాకలాపం' కూడా ఇదే లైన్లో సాగిపోతుంది. 'భామా కలాపం-2' ఆరంభంలో వినోదాత్మకంగా సాగుతూ బాగానే టైంపాస్ చేయిస్తుంది. ఫస్ట్ పార్ట్ లో హైలైట్ గా నిలిచిన ప్రియమణి-శరణ్యల కెమిస్ట్రీ... ఇందులోనూ బాగానే వర్కవుట్ అయింది. వీళ్లిద్దరి మధ్య వచ్చే సరదా సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. క్రైమ్ సెటప్ కూడా ఆరంభంలో ఆసక్తి రేకెత్తించేలానే ఉంటుంది. వెయ్యి కోట్ల కొకైన్.. దాని కోసం వేర్వేరు గ్యాంగుల ప్లానింగ్ అంతా చూసి ఒక పెద్ద రేంజి సినిమా చూడబోతున్న ఫీలింగ్ కలుగుతుంది. ఐతే ప్రియమణిని ఫ్రేమ్ చేస్తూ పోలీసాఫీసర్ తన పని కోసం వాడుకునే క్రమమే అంత కన్విన్సింగ్ గా అనిపించదు. అసలా పోలీసాఫీసర్ పాత్రే సరిగా అర్థం కాదు. డిపార్టుమెంట్లో తనకు గుర్తింపు దక్కట్లేదని పెద్ద క్రైమ్ చేయడంలో ఔచిత్యం కనిపించదు. ఇక క్రైమ్ చేయడానికి అతను టీంతో కలిసి చేసే ప్లానింగ్.. దాని ఎగ్జిక్యూషన్ కొంత ఆసక్తికరంగానే అనిపిస్తుంది కానీ.. చాలా వరకు సీన్లు కన్వీనియెంట్ గా సాగిపోతాయి. ఎక్కడా పెద్ద టాస్క్ ఎదురు కాకపోవడంతో థ్రిల్ ఉండదు. కథనం మరీ బోరింగ్ గా అయితే అనిపించదు కానీ.. అదే సమయంలో ఎగ్జైట్మెంగ్ గానూ ఉండదు. హై ఇచ్చే సీన్లయితే లేవు. క్లైమాక్స్లో అయినా మెరుపులు ఉంటాయనుకుంటే.. అదీ మామూలుగా సాగిపోతుంది. 'భామాకలాపం'తో పోలిస్తే 'భామాకలాపం-2' రిచ్ గా అనిపిస్తుంది కానీ.. కంటెంట్ మాత్రం అంత రిచ్ గా లేదన్నది వాస్తవం. ఓటీటీ సినిమానే కాబట్టి ప్రియమణి కోసం ఒకసారి చూడ్డానికి ఇది ఓకే. నటీనటులు: అనుపమ పాత్రలో ప్రియమణి మరోసారి ఆకట్టుకుంది. సినిమాను ఆమె తన భుజాల మీద మోసిందని చెప్పాలి. కానీ ఫస్ట్ పార్ట్ లో ఉన్నంత ఆసక్తికరంగా ఈసారి తన పాత్ర లేదు. శిల్ప పాత్రలో శరణ్య అదరగొట్టింది. ఆమె కామెడీ బాగా చేయగలదని ఈ సినిమాతో రుజువవుతుంది. సినిమా బోర్ కొట్టకుండా చూడడంలో తన పాత్రే కీలకం. రఘు ముఖర్జీ కీలక పాత్రలో బాగానే చేశాడు. ప్రియమణి భర్త పాత్రలో రుద్ర ప్రతాప్ కు పెద్దగా స్కోప్ దక్కలేదు. బ్రహ్మాజీ కనిపించిన కాసేపు నవ్వించాడు. కానీ ఆయనది మరీ తక్కువ నిడివి ఉన్న పాత్ర. దాన్ని ఇంకా వాడుకోవాల్సింది. సీరత్ కపూర్ చాలా గ్లామరస్ గా కనిపించింది. కానీ అందువల్ల ఈ సినిమాకు ఒనగూరిన ప్రయోజనం తక్కువే.

## మహేశ్, రాజమౌళి సినిమాలకు టైటిల్

సూపర్ స్టార్ మహేష్ బాబు తన తదుపరి సినిమా అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ఇప్పటికే స్క్రిప్ట్ పని పూర్తయిందని రాజమౌళి తండ్రి, ఈ సినిమాకి కథా రచయిత అయిన విజయేంద్ర ప్రసాద్ పలు మీడియా ఇంటర్వ్యూ లో చెప్పిన సంగతి కూడా తెలిసిందే. ఈ సినిమా కథా నేపథ్యం ఒక అడ్వెంచర్ లా ఉంటుంది అని ఇంతకు ముందు రాజమౌళి చెప్పారు. మహేష్ బాబుతో చేస్తున్న సినిమా ఒక యాక్షన్ సినిమాగా ఉంటుందని, అది జేమ్స్ బాండ్ తరహాలో లేదా ఇండియానా జోన్స్ తరహాలో ఉంటుందని, అయితే అది భారతీయ సంస్కృతి ఆధారంగా నిర్మితమై ఉంటుందని రాజమౌళి ఇంతకుముందు ఒక మీడియా సంస్థలతో మాట్లాడుతూ చెప్పారు. ఈ సినిమా కోసమే ఈమధ్యనే మహేష్ బాబు జర్మనీ వెళ్లి కొన్ని రోజులు శారీరక శిక్షణ పొందిన సంగతి కూడా తెలిసిన విషయమే. అయితే ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమా టైటిల్స్ గురించి వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకి రెండు పేర్లను అనుకుంటున్నట్టుగా అందులో ఒకటి 'మహారాజా' ఇంకోటి 'చక్రవర్తి' అని ఇలా వైరల్ అవుతున్నాయి. అన్ని భాషలకి ఇవే టైటిల్స్ ఖరారు చేసినట్టుగా వార్తలు వస్తున్నాయి.కానీ అధికారికంగా ఈ మహేష్ బాబు, రాజమౌళి సినిమా గురించి ఎటువంటి సమాచారం లేదు కానీ, రోజూ ఈ సినిమా గురించి కొన్ని వార్తలు మాత్రం సామాజికమాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ సినిమా టైటిల్స్ గురించిన వార్తలు వైరల్ అవుతున్నాయి.



## అందానికే మరో అందం....






## షుగరు పేషెంట్లకు గుడ్ న్యూస్.. రెండేళ్లలో మందు?

శరీరానికి ఎన్ని వ్యాధులు వచ్చినా నయం చేయడానిక మందులున్నాయి కానీ షుగర్ వ్యాధి వస్తే మాత్రం శాశ్వతంగా తగ్గడానికి మందుల్లేవు. ఎప్పుడూ నియంత్రణలోనే ఉంచుకుంటుండాలి. అలా చేయకపోతే ప్రాణాలకే ప్రమాదం సంభవిస్తుంది. ప్రస్తుతం శాస్త్రవేత్తలు షుగరు రోగులకు ప్రత్యేకమైన చాక్లెట్ ను తయారు చేశారు. శరీరంలో ఇన్సులిన్ అవసరాలను ఇది తీరుస్తుంది. వీటిని యూఐటీ ఆర్కిటిక్ యూనివర్సిటీ ఆఫ్ నార్వే, యూనివర్శిటీ ఆఫ్ సిడ్నీ లు తయారు చేశాయి. ప్రపంచవ్యాప్తంగా 42.5 కోట్లమంది మధుమేహంతో బాధపడుతున్నట్లు అంచనా. అందులోను భారతదేశంలో రోజురోజుకు వీరి సంఖ్య పెరుగుతోంది. మారుతున్న జీవనశైలితోపాటు మారిపోయిన ఆహారపు అలవాట్లు కూడా మధుమేహం పెరగడానికి కారణమవుతున్నాయి. 42.5 కోట్ల మందిలో 7 కోట్ల మంది ఇన్సులిన్ ఇంజక్షన్లను తీసుకుంటున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇన్సులిన్ తీసుకొనే అవసరం లేకుండా మధుమేహం చికిత్సలో తోడ్పడే ఔషధాన్ని తయారు చేశారు. ఇది ఎలా పని చేస్తుందో తెలుసుకుందాం. ఒకే కూటమిలో ఇద్దరు చంద్రులు, ఢిల్లీ కొత్త గేమ్ - టార్గెట్ ఫిక్స్..!? ఈ చాక్లెట్లో మానవ వెంట్రుకల కంటే చిన్న పరిమాణంలో ఉండే నానో క్యారియర్లు ఉంటాయి. శరీరం అవసరమైన సమయంలో ఇన్సులిన్ ను తయారుచేయలేనప్పుడు చాక్లెట్ ఇన్సులిన్ సమతుల్యాను పెంచేందుకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయి స్థాయులు పెరిగినప్పుడు, ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్లు చురుకుగా మారతాయి. ఇలా మారి ఆ పూతను విచ్ఛిన్నం చేయడంతో అది కరిగిపోయి ఇన్సులిన్ విడుదల చేస్తుంది. తద్వారా అది రక్తం నుంచి చక్కెరను తొలగిస్తుంది. శరీరంలో షుగరు పెరిగితే ఆటోమాటిక్ గా ఇన్సులిన్ ను ఉత్పత్తి చేస్తుంది. దీన్ని డయాబెటిక్ ఎలుకలపై కూడా పరీక్షించారు. వీటిల్లో కూడా సానుకూల పరిణామం కనపడింది. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని పరిశోధకులు వెల్లడించారు. వచ్చే సంవత్సరం దీన్ని మనుషులపై ప్రయోగిస్తారు. అనంతరం రెండు సంవత్సరాల్లో మార్కెట్ లోకి రానున్నాయి.



## ఉసిరితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..!

ఉసిరికాయ అనేది దక్షిణ ఆసియాలో ఉద్భవించిన ఒక ఆరోగ్యకరమైన పుష్పించే మొక్క. ఇది ఫిలాంథస్ కుటుంబానికి చెందినది. దీని శాస్త్రీయ నామం ఫిలాంథస్ ఎంబ్లికా. ఉసిరి చెట్టు సుమారు 8 నుండి 18 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. దీని ఆకులు చిన్నవిలీవ, ఆకుపచ్చగా ఉంటాయి. ఉసిరికాయలు గుండ్రంగా, పసుపు రంగులో ఉంటాయి. ఉసిరికాయ భారతదేశంలో సాంప్రదాయ ఆయుర్వేద ఔషధంలో వేల సంవత్సరాలుగా ఉపయోగించబడుతోంది. ఇది విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు మరియు ఇతర పోషకాలు కలిగి ఉంటుంది. ఉసిరికాయను వంటల్లో కూడా వినియోగిస్తుంటాం. ఉసిరితో పచ్చడి కూడా చేస్తుంటారు. అన్నం ఉసిరి పచ్చడి కాంబినేషన్ యమ రుచిగా ఉంటుంది. ఉసిరికాయతో ఎన్నోఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాతావరణ మార్పులను పసిగట్టేలా ఉసిరికాయ యొక్క కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి: - రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరికాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలోని బ్యాక్టీరియా,వైరస్లతో పోరాడుతుంది. - జలుబు మరియు దగ్గు నుండి ఉపశమనం కలిగిస్తుంది: ఉసిరికాయ జలుబు మరియు దగ్గు యొక్క లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఉసిరికాయ పొడిని తేనెతో కలిపి తీసుకోవడం ద్వారా ఇది ఉత్తమంగా పనిచేస్తుంది. ఒకే కూటమిలో ఇద్దరు చంద్రులు, ఢిల్లీ కొత్త గేమ్ - టార్గెట్ ఫిక్స్..!? - మలబద్ధకాన్ని నివారిస్తుంది: ఉసిరికాయలోని ఫైబర్ మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఉసిరికాయ పొడిని నీటితో కలిపి తీసుకోవడం ద్వారా ఇది ఉత్తమంగా పనిచేస్తుంది. - క్యాన్సర్ను నివారించడంలో సహాయపడుతుంది: ఉసిరికాయలోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. - చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఉసిరికాయలు చర్మాన్ని ఆరోగ్యంగా మరియు చర్మంపై మచ్చలు నివారించడంలో సహాయ పడతాయి. వైనాట్ 400: రోడ్ మ్యాప్పై బీజేపీ కసరత్తు - జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి : ఉసిరికాయలు మన కేశాలను ఆరోగ్యవంతంగా బలంగా ఉండటంలో సహకరిస్తాయి. అంతేకాదు తలలో చుండ్రును నివారించడంలో సహాయపడతాయి.

## సిరాజ్ కళ్లు చెదిరే యార్కర్.. దెబ్బకు ఇంగ్లండ్ బ్యాటర్ ఫ్యూజ్‌లు ఔట్!



రాజ్కోట్ వేదికగా ఇంగ్లండ్తో జరుగుతున్న మూడో టెస్టులో భారత పేసర్ మహ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగాడు. తొలి ఇన్నింగ్స్లో 4 వికెట్లతో సిరాజ్ అదరగొట్టాడు.పోప్, బెన్ ఫోక్స్, రెహాన్ అహ్మద్ వంటి కీలక వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ను దెబ్బతీశాడు. ముఖ్యంగా రెహాన్ అహ్మద్ను సిరాజ్ ఔట్ చేసిన విధానం గురించి ఎంత చెప్పుకున్న తక్కువే. అహ్మద్ను అద్భుతమైన యార్కర్తో సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేశాడు.ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్లో 70వ ఓవర్లో ఐదో బంతిని యార్కర్గా సంధించాడు. ఈ క్రమంలో సిరాజ్ వేసిన యార్కర్కు అహ్మద్ దగ్గర సమాధానమే లేకుండా పోయింది. అహ్మద్ బ్యాట్తో అడ్డుకునే లోపే బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటు వేసింది. ఇది చూసిన అహ్మద్‌కు దెబ్బకు ఫ్యూజ్‌లు ఎగిరిపోయాయి.ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఇక ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్ను 319 పరుగుల వద్ద ముగించింది. 207/2 ఓవర్ నైట్ స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. అదనంగా 112 పరుగులు చేసి ఆలౌటైంది.ఇంగ్లండ్ బ్యాటర్లలో బెన్ డకెట్(153) అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. భారత బౌలర్లలో సిరాజ్తో పాటు కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా తలా రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు భారత్ తమ తొలి ఇన్నింగ్స్లో 445 పరుగులు చేసింది.

## లంచ్ తర్వాత పూనకం వచ్చినట్లుగా.. 29 పరుగుల వ్యవధిలోనే!

ఇంగ్లండ్తో రాజ్కోట్ టెస్టు మూడో రోజు ఆటలో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా భోజన విరామ సమయం తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగారు.వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ జోరుకు అడ్డుకట్ట వేశారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా 1-1తో సమంగా ఉన్న టీమిండియా- ఇంగ్లండ్ మధ్య గురువారం మూడో టెస్టు ఆరంభమైంది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 445 పరుగులకు



ఆలౌట్ అయింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సరికి కేవలం రెండు వికెట్లు నష్టపోయి 207 పరుగులు చేసి.. టీమిండియాకు దీటుగా బదులిచ్చింది.ఈ క్రమంలో శనివారం ఆట ఆరంభం నుంచే ఇంగ్లండ్‌ను కట్టడి చేయడంలో టీమిండియా బౌలర్లు విజయవంతమయ్యారు. దెబ్బకు తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ లంచ్‌కు ముందు 290/5 స్కోరు వద్ద నిలిచింది.అయితే, భోజనం చేసి మళ్లీ మైదానంలో దిగిన తర్వాత కేవలం 29 పరుగుల వ్యవధిలోనే మిగిలిన ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో 319 పరుగుల వద్ద ఇంగ్లండ్ ఆలౌట్ కాగా.. టీమిండియాకు 126 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక వరుస విరామాల్లో టీమిండియా బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్ వికెట్లు తీసిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.ఇక ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ అత్యధికంగా నాలుగు వికెట్లు దక్కించుకోగా.. కుల్దీప్ యాదవ్ రెండు, జడేజా రెండు, అశ్విన్ ఒక వికెట్ పడగొట్టారు. ఇదిలా ఉంటే.. ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా అశ్విన్ మూడో రోజు ఆటకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం.. అశ్విన్ లేకుండానే పది మంది యాక్టివ్ (బౌలింగ్, బ్యాటింగ్) ప్లేయర్లతో టీమిండియా బరిలోకి దిగింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.